RNI No - APTEL/2022/81596

# జనోదయ

janodaya
కరీంనగర్ సోమవారం 29.12. 2025 సంపుటి : 03 సంచిక : 28 పేజీలు : 08 వెల: రూ.5
Karimnagar Monday 29.12.2025 Volume: 03 Issue 28 Pages 08 Cost 5/
తెలుగు దినపత్రిక

## బుగ్గకు పెద్దపులి భయం!



2

## 2029 నాటికి శ్రీహరికోటలో కొత్త లాంచ్‌ప్యాడ్



6

## గంభీర్‌పై నమ్మకముంది



6

# నీళ్లు..నిప్పులు

## సభకు కేసీఆర్..ఇయ్యాల్టి నుంచే అసలు వార్

- నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- సాగునీటి ప్రాజెక్టులపైనే ప్రధాన చర్చ
- పాలమూరు..రంగారెడ్డిపై బీఆర్ఎస్ గరం..గరం
- కేసీఆర్ సభకు వస్తే సాగునీటిపై చర్చకు సిద్ధమన్న సీఎం
- తాము చర్చకు సిద్ధమేనన్న కేటీఆర్,హరీష్
- సభను హుందాగా నడుపుతాం: మంత్రి దుద్దిళ్ల
- సర్కార్ వైఫల్యాన్ని ఎండగడతాం: ఏలేటి

9



## గ్రామాలను 'డిజిటల్ విలేజ్'లుగా తీర్చిదిద్దండి

ప్రజాస్వామ్యంలో గ్రామాలు బలంగా ఉంటేనే... రాష్ట్రాలు, దేశం అభివృద్ధి
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా బాధ్యతతో పని చేయండి
మంత్రి శ్రీధర్ బాబు

7



## చదివితేనే అభివృద్ధి సాధ్యం



8

బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. చదివితేనే అభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు. ఆదివారం మంత్రి నల్గొండ జిల్లా, మాడుగులపల్లి మండల కేంద్రంలో సుమారు 6 కోట్ల 74 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ పాఠశాల, కళాశాల భవనాలను ప్రారంభించారు. శంకుస్థాపన చేశారు.

# నుమాయిష్‌కు సర్వం సిద్ధం

- జనవరి 1 నుంచి నుమాయిష్-2026
- 45రోజుల పాటు ఎగ్జిబిషన్
- పటిష్టమైన ఏర్పాట్లు
- నుమాయిష్ హైదరాబాద్ వైభవం
- ఐటీ, పరిశ్రమల మంత్రి డి. శ్రీధర్‌బాబు







**జనోదయ : హైదరాబాద్:**

హైదరాబాద్ నగర ప్రజలు ప్రతి ఏడాది ఎంతో ఉత్సాహంగా ఎదురుచూసే నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్) 2026 తేదీలు అధికారికంగా ఖరారయ్యాయి. 85వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన-2026కు సంబంధించిన పూర్తి వివరాలను అనౌన్స్ చేశారు.నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శన జనవరి 1, 2026న ప్రారంభమై ఫిబ్రవరి 15, 2026 వరకు మొత్తం 45 రోజుల పాటు కొనసాగనుందని వివరించారు. ప్రారంభోత్సవ వివరాలు.. ఈసారి నుమాయిష్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి ఘనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు, శని, ఆదివారాల్లో రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. ఈసారి ప్రవేశ టికెట్ ధరను రూ.50గా నిర్ణయించారని మంత్రి తెలిపారు. అదే విధంగా, ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది నుమాయిష్‌లో మొత్తం 1,050 స్టాళ్లకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొననున్నారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు , హస్తకళలు, చేనేత ఉత్పత్తులు.. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార పదార్థాలు, స్వదేశీ ఉత్పత్తులు వంటి వాటిని ప్రజల ముందుకు తీసుకురావడానికి ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా షాపింగ్‌తో పాటు వినోదానికి కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. పిల్లలు, కుటుంబ సభ్యులను ఆకట్టుకునేలా ఆటవిడుపు పరికరాలు, ఫుడ్ కోర్టులు.. సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కాగా నుమాయిష్‌ను కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగర సంస్కృతి, వ్యాపార వైభవాన్ని ప్రతిబింబించే వేడుక అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, వ్యాపారులను ప్రోత్సహించి ఈ 85వ నుమాయిష్‌ను ఘన విజయంగా మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మట్టి లారీలను అడ్డుకున్న బెజ్జాల గ్రామస్తులు



**వాస్తవం : జైపూర్**

జైపూర్ మండలం బెజ్జాలలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్ట్ వల్ల స్థానిక రహదారి ధ్వంసం అయినదని గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు.ఆదివారం స్థానిక రహదారిలో హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం వెళ్లే మట్టి లారీలను అడ్డుకొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం అధిక లోడు వేసుకొని మితిమీరిన వేగంతో మట్టి లారీలతో స్థానిక రోడ్డును పూర్తిగా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ గ్రామానికి ఉన్న ఏకైక మార్గం చెడిపోవడంతో ఆటోలు, ఇతర వాహనాలు, అత్యవసర సమయంలో అంబులెన్స్ వంటి వాటికి పూర్తి అంతరాయం ఏర్పడి ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి పనులను గత రెండేళ్ల నుండి ప్రారంభించినప్పటికీ ఏ ఒక్కరోజు దుమ్ము నివారణ చర్యలు చేపట్టలేదని ఆగ్రహించారు.రహదారి వెంబడి రోడ్డుకు ఇరువైపున గల వరి ,పత్తి ,కంది పంట భూముల రైతులకు దుమ్ము, ధూళి ప్రభావంతో తీవ్ర పంట నష్టం వాటిల్లుతుందన్నారు.అంతేకాకుండా స్థానిక ఎస్సీ కాలనీవాసులు శ్వాసకోశ వ్యాధులు సోకి అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. స్థానిక రోడ్డును బాగు చేసి హైవే పనుల కోసం ప్రత్యామ్నాయ రహ దారి ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక మండల అధికారి చర్యలు తీసుకోవాలని కోరారు.

# బుగ్గకు పెద్దపులి భయం!

## చంద్రవెల్లి అడవుల్లో పాదముద్రల గుర్తింపు

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 28:**

బెల్లంపల్లి మండలంలోని బుగ్గ పరిసర ప్రాంతాలను పులి భయం వెంటాడుతోంది. ఈనెల 19న బుగ్గ అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న కరిశెలఘట్టం, బుగ్గ గూడెం అటవీ ప్రాంతంలో గిరిజనులకు పెద్దపులి కనిపించింది. దీంతో బుగ్గ అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల వ్యవధిలోని పెద్దపులి ఇదే ప్రాంతంలో మేకల మందపై దాడి చేసి మేకను చంపేసింది. అప్రమత్తమైన అటవీ అధికారులు బుగ్గ గూడెం, కరిశెలఘట్టం శివారులోని గొంతెమ్మ గుండు అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. బుగ్గ , అంకుశం, మాదారం, అడవుల మీదుగా పెద్దపులి తిర్యాణి గుట్టల్లోని మొర్రిగూడ అటవీ ప్రాంతానికి వెళ్లిపోయిందని స్పష్టం చేశారు. కాగా బుగ్గ దేవాలయం వెనక కొండపై భాగంలో గాండ్రింపులు వినిపిస్తున్నట్లు దేవాలయం ప్రాంగణంలో ఉండే వ్యక్తులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బుగ్గ గూడెం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వంట చెరుకు కోసం కొండపోచమ్మ ప్రాంతం వైపు వెళ్లగా అక్కడ పెద్దపులి కనిపించినట్లు చెబుతున్నారు. పెద్దపులిని చూసిన ఆ యువకులు ప్రాణభయంతో పరిగెత్తుకుంటూ దేవాలయం వద్దకు వచ్చి పెద్దపులి కనిపించిన విషయాన్ని



స్థానికులకు తెలిపారు. వెంటనే వారు అటవీశాఖ సిబ్బందికి సమాచారమిచ్చారు. స్థానికుల నుండి సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పెద్దపులి కదలికలను గుర్తించేందుకు కొండపోచమ్మ అటవీ ప్రాంతంలోకి వెళ్లారు.

### చంద్రవెల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు గుర్తింపు



బుగ్గ అటవీ ప్రాంతంలో ఆదివారం స్థానిక యువకులకు పెద్దపులి కనిపించిన నేపథ్యంలో మండలంలోని చంద్రవెల్లి అటవీ ప్రాంతంలో అదే రోజు ఉదయం అటవీ శాఖ అధికారులకు పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. చంద్రవెల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను మేపేందుకు గాని, వంట చెరుకు కోసం గాని గ్రామస్తులు అడవిలోకి వెళ్ళవద్దని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో అటవీ ప్రభావిత గ్రామాల్లో పెద్దపులి భయం పట్టుకుంది. అటవీశాఖ అధికారులు పెద్దపులి కదలికలపై స్పష్టమైన సమాచారం అందిస్తూ ప్రభావిత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని అభిప్రాయాలు పలువురి నుండి వ్యక్తమవుతున్నాయి.

# దేవాదాయ శాఖ పరిధిలోకి బెల్లంపల్లి శివాలయం ?



**జనోదయ , బెల్లంపల్లి, డిసెంబర్ 28:**

బెల్లంపల్లి పట్టణంలోని బుధాకలన్ శివారులో గల శివాలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ (ఎండోమెంట్) పరిదిలోకి వెళ్లనుంది. శివాలయానికి సంబంధించిన భూమి దేవదాయ శాఖ (ఎండోమెంట్)కు 2019 లోనే కేటాయించినట్లు తెలుస్తున్నది.1975 నుండి ఈ దేవాలయం బెల్లంపల్లి పట్టణానికి చెందిన అరవింద గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులైన తేజ్ ప్రకాశగర్వాల్ కుటుంబం ఆధీనంలో కొనసాగుతోంది. 1975 ప్రాంతంలో భూదాకలాన్ లో బ్రిజ్ లాల్ అగర్వాల్ జ్ఞాపకార్థం అతని కుమారులు టాకే చంద్ అగర్వాల్, రూప్ చంద్ అగర్వాల్ లు కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో శివాలయాన్ని నిర్మించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులైన తేజ్ ప్రకాష్ అగర్వాల్ ఆధీనంలో శివాలయం నేటికీ కొనసాగుతోంది.ఈ శివాలయం బెల్లంపల్లి పట్టణంలో పేరుగాంచింది. ఇక్కడ మహాశివరాత్రి, శ్రావణ, కార్తీక మాసాలలో భక్తుల తాకిడి విపరీతంగా ఉంటుంది. వివాహ కార్యక్రమాలకు ఈ శివాలయం పెట్టింది పేరుగా మారింది. దేవాదాయ శాఖ అధికారులు ఈ శివాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటారా, లేక అదే తీరున కొనసాగిస్తారో చూడాలి మరి.

# మాస్టర్ అథ్లెటిక్స్‌లో సింగరేణి ఉద్యోగికి బ్రాంజ్ మెడల్స్



అథ్లెటిక్స్ పోటీలో లాంగ్ జంప్ చేస్తున్న శ్రీనివాసరాజు



**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 28:**

ఈనెల 27, 28 తేదీల్లో కరీంనగర్ పట్టణంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్టేడియంలో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లిలోని శాంతిఖని గనిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కారంపూడి శ్రీనివాసరాజు తనదైన ప్రతిభ చూపారు. 100 మీటర్ల పరుగు పందెంలో 60 ప్లస్ కేటగిరితో పాటు లాంగ్ జంప్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఉద్యోగ విరమణ సమయంలో కూడా క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపిన సింగరేణి ఉద్యోగి కారంపూడి శ్రీనివాసరాజును పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రశంసించారు.



# తిలక్ వాకర్స్ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 28:** బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లి మన్నెగూడ గ్రామంలో ఆదివారం బెల్లంపల్లి తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు నిరుపేద గిరిజనులకు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేసే కార్యక్రమాలను వారు చేపడుతున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ని పలు అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గిరిజన గ్రామాల్లో ఇప్పటికే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వాకర్స్ సభ్యులు సేవా కార్యక్రమాలు చేపడుతూ గిరిజనులకు దగ్గరయ్యారు. ఆదివారం పాత బెల్లంపల్లి మన్నెగూడ గ్రామంలో 100కు పైగా గిరిజనులకు మాజీ జెడ్పిటిసి కారుకూరి రామ్ చందర్ , సర్పంచ్ పెట్టెం లక్ష్మి రాయలింగుల ఆధ్వర్యంలో చలి దుప్పట్లను అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అంతకుముందు బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో దినసరి కూలీలు, యాచకులకు ఉచితంగా అల్పాహారాన్ని అందించారు. ఈ రెండు కార్యక్రమాల్లో తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రత్నం రాజన్న, రంగ రామన్న, కంటే వాడ నగేష్, గెల్లి జయరాం యాదవ్, కజ్జం రమేష్ ,గరిగే వేణుగోపాల్, జరిగే రాజకుమార్, కొయ్యడ శంకర్ గౌడ్, నాగుల లింగయ్య, కీర్తి మల్లేష్, కన్నవేణి రాజేష్, భోగశ్రీనివాస్, గంట శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, గైని మల్లేష్, రాచర్ల సంతోష్, ఏనుగు నరేష్, ముత్య వెంకటరాజం, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.




# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

-సింగరేణి డైరెక్టర్ పి అండ్ పి వెంకటేశ్వర్లు -



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 28:** సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని సింగరేణి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు సూచించారు. ఏరియా పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం ఆయన కెకె ఓసిపిని సందర్శించారు. ఓసిపి వ్యూ పాయింట్ నుండి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తిని పెంపొందించేందుకు అధికారు లకు తగిన సూచనలు అందజేశారు. అనంతరం ప్రాణహిత కాలనీ సమీపంలోని సోలార్ పవర్ ప్రాజెక్టులోని బ్యాటరీ స్టోరేజ్ సిస్టంను సందర్శించి, పవర్ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ, కెకె ఓసి ప్రాజెక్టు అధికారి మల్లయ్య, ఏరియా ఇంజనీర్ జా , కెకె ఓసిపి మేనేజర్ కె రామరాజు, పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యంలో అక్కా చెల్లెళ్ల ప్రతిభ

**ఒకే వేదికపై గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు సొంతం**

**జనోదయ,బెల్లంపల్లి, డిసెంబర్ 28:**

బెల్లంపల్లి పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు వేముల శ్రీనివాస్ , మానస దంపతులకు చెందిన ఇద్దరు కుమార్తెలు కూచిపూడి నృత్యంలో తమ ప్రతిభను చాటి బెల్లంపల్లికి అరుదైన గౌరవం తెస్తున్నారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న నానుడిని నిజం చేస్తున్నారు. అక్క చెల్లెల్లు చిన్నారి వేముల వెన్నెల, వేముల శ్రీ నిత్యలు





శనివారం హైదరాబాదులోని గచ్చి బౌలి స్టేడియంలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను సొంతం చేసుకున్నారు. ఈ అక్క చెల్లెలు బెల్లంపల్లిలోని కాల్‌టెక్స్ ప్రాంతంలోని నటరాజ డాన్స్ అ కాడమీలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్నారు. చిన్నారి వెన్నెల బెల్లంపల్లిలోని హర్ష కాన్వెంట్ స్కూల్లో 8వ తరగతి చదువు తుండగా, చెల్లెలు శ్రీ నిత్య బెల్లంపల్లిలోని లోటస్ స్కూల్లో 6 వ తరగతి చదువుతుంది.ఒకే వేదికపై 7 వేల మంది సామూహికంగా పాల్గొన్న నృత్య పోటీల్లో వీరి ద్దరూ ప్రతిభ చూపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను సొంతం చేసుకోవడం పట్ల తల్లి దండ్రులు వేముల శ్రీనివాస్,మానసలు ఆనందం చేశారు. వీరి ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు అక్కా చెల్లెళ్లను అభినందించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పోలంపల్లి గ్రామ సర్పంచ్



**జనోదయ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి**

మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీలోని ప్రజలకు సర్పంచ్ దర్శనాల ప్రమీల రమేష్ ప్రజలు నన్ను నమ్మి సర్పంచ్‌గా గెలిపించిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం మొట్టమొదట ఎస్టీ వాడాలో పోచమ్మ గుడి దగ్గర బోరు వేయించి మోటర్‌తో సహా తాగునీటి సమస్యను తీర్చారు. అనంతరం అదేవాడాలో ని వాళ్లకు లక్ష రూపాయలకు పైన టెంట్ హౌస్ సామాన్లు ప్రజెంటేషన్ చేయడం జరిగింది. దర్శనాల ప్రమీల రమేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు మామీద పెట్టుకున్న నమ్మకానికి అహర్నిశలు శ్రమిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని భీమారం మండలంలోని నిరుపేదలకు అండగా ఉంటూ తోడునీడగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉంటానని మండలంలోని ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ మాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కామర నరేందర్, వార్డ్ సభ్యులు బూనేని రాజన్న, కోలకాని శ్రీలత గ్రామ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

**వెంకటాపూర్ సర్పంచ్ సెగ్యం వెంకటేష్**

**జనోదయ ,మందమర్రి డిసెంబర్ 27:** మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గుడిపల్లి వెంకటాపూర్ గ్రామంలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ స్పష్టం చేశారు. ఆదివారం గ్రామంలోని 2, 3 వ వార్డులలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రెండు వార్డుల పరిధిలోని ట్రాన్స్ ఫార్మర్లు ఇండ్ల మధ్యన ఉండటం, తరచూ వాటి నుండి మంటలు ఎగిసిపడుతు ప్రమాదకరంగా మారాయని గ్రామస్థులు తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. వారి ఇబ్బందులను తొలగించేందుకు విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ ఫార్మర్ల కు మరమ్మతులు చేయడంతో జనావాసాలకు దూరంగా ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు సంతోష్, ప్రశాంత్, అశోక్, వేల్పుల మహేశ్వరి – సాగర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## నూతన సంవత్సర వేడుకలను

# కుటుంబ సభ్యులతో జరుపుకోవాలి

**బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు**

**ఎస్సై రాజశేఖర్**

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 28:**

పట్టణ ప్రజలు నూతన సంవత్సరం వేడుకలు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని పట్టణ ఎస్సై ఎస్ రాజశేఖర్ కోరారు. పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఉత్సాహం పేరుతో చేసే విన్యాసాలు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. డిసెంబర్ 31న పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడితే వాహనాలను జప్తు చేయడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని రవాణా శాఖకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. అంతే కాకుండా పట్టణంలో డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని, అధిక శబ్దాలతో ఇరుగు పొరుగు వారికి, వృద్ధులకు, రోగులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. యువత బైక్‌లపై రేసింగ్ చేయడం, సైలెన్సర్లు తొలగించి అతి వేగంగా ప్రయాణించ డం



వంటివి చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు సంతోషంగా కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.

## జర్నలిస్టుల హక్కులను కాల రాస్తే సహించేది లేదు

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్**



**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 28:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాల రాస్తే సహించేది లేదని ప్రజా, జర్నలిస్టు పోరాటాలతో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని బహుజన సమాజ్ పార్టీ బిఎస్పి జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 252ను వెంటనే ఉపసంహ రించుకొని జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా అంటూ విభజించి పాలించే విధానం మంచిది కాదని ప్రభుత్వానికి హితవు పలికారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ అనేది గుర్తింపు మాత్రమే కాదని వృత్తి బాధ్యత స్వేచ్ఛ గౌరవానికి సంబంధించిందన్నారు, జర్నలిస్టులను ఇబ్బంది పెట్టే ఎటువంటి నిర్ణయాన్ని అయినా బీఎస్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. జీవో 252 ను వెంటనే వెనక్కు తీసుకోని జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

## కూచిపూడి నృత్యంలో

# శ్రీ శ్రేష్ఠ ప్రతిభ

**గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో దక్కిన చోటు**

**జనోదయ, మందమర్రి , డిసెంబర్ 28:**

హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27న నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలో మండలంలోని చిన్నారి పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన శెట్టి సత్యనారాయణ - మాధవి దంపతుల కూతురు శెట్టి శ్రీ శ్రేష్ఠ కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శనలతో రాణిస్తుంది. పట్టణంలోని గ్రేస్ లిటిల్ హార్ట్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శ్రీ శ్రేష్ఠ గత 3



సం,,గా పట్టణంలోని శ్రీ సాయి నాట్య కళానిలయంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది నృత్యంలో రాణిస్తుంది. ఈ నెల 27న హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానాన్ని సంపాదించింది.గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించడంతో పాటు, సర్టిఫికెట్ పతకాన్ని సాధించి కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శనతో మండలానికి వన్నె తెచ్చింది.గచ్చిబౌలి వేదికగా 7 వేల మంది చిన్నారులు ప్రదర్శించిన సామూహిక నృత్య పోటీల్లో శ్రీ శ్రేష్ఠ ప్రతిభ చూపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను సొంతం చేసుకోవడం పట్ల తల్లిదండ్రులు సత్యనారాయణ, మాధవిలు హర్షం వ్యక్తం చేశారు. చిన్నారి అద్భుత నృత్య ప్రతిభను గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నం శ్యాం కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.





## బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్**



**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 28:**

జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలోని కత్తెరసాల గ్రామ సర్పంచ్ చేతేల్లి మోహన్ రెడ్డి, ఆయన అనుచరుడు వెన్నపురెడ్డి అజయ్ రెడ్డి బిసి కులాలపై చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన మాదాసు కిష్టయ్య కు మద్దతు ప్రకటించిన వార్డ్ సభ్యుడు భూసరి కళ్యాణ్ యాదవ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన పై దాడి, బెదిరింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ చేతేల్లి మోహన్ రెడ్డి, ఆయన అనుచరుడు వెన్నపురెడ్డి అజయ్ రెడ్డిలు యాదవ, మున్నూరు కాపు కులాలను ఉద్దేశించి పరుష పదజాలంతో, దూషిస్తూ కళ్యాణ్ యాదవ్‌ని బెదిరించడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇది కేవలం వ్యక్తిగత దాడి కాదని, బీసీ సామాజిక వర్గాలపై జరిగిన సామాజిక దౌర్జన్యం అని ఆయన తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని వ్యక్త పరచే హక్కు ఉండగా, బీసీ అభ్యర్థికి మద్దతిచ్చినందుకే ప్రాణహానీ బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. వీరిపై జిల్లా అధికారులు కఠిన చర్యలు చేపట్టి బీసీల హక్కులను కాపాడాలని కోరారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం

జనోదయ,పెద్దపల్లి ప్రతినిధి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లాలో భారతీయ జనతా పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ నాగపూరి రాజమౌళి గౌడ్ హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగిరేలా కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ప్రజలలో బీజేపీ పట్ల ఆదరణ పెరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణలో రెండేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. అలాగే, పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, రెండేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, స్వార్థ రాజకీయాలు, కుటుంబ పాలనకే పరిమితమయ్యాయని ఆరోపించారు. తెలంగాణ



రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని అభివృద్ధిగా మలచడంలో ఈ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు.రానున్న రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, కార్యకర్తల సమిష్టి కృషితో అది సాధ్యమవుతుందని సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మీస అర్జున్ రావు, మెరుగు హనుమంత్ గౌడ్, గొట్టిముక్కల సురేష్ రెడ్డి, రావుల రాజేందర్తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమల్ల మహేష్, పల్లె సదానందం, కడారి అశోక్ రావు, కందుల సంధ్యారాణి, నల్ల మనోహర్ రెడ్డి, చౌదరి మహేందర్, నిర్మల గౌడ్, మచ్చగిరి రాము, అమర గాని ప్రదీప్, ముసుకుల భాస్కర్ రెడ్డి, శివంగారి సతీష్, వెల్లంపల్లి శ్రీనివాస్, అక్కపెల్లి క్రాంతి, కామినేని రాజేందర్, కురుమ వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంలకు కన్నాలు వేసే నేరగాళ్లు అరెస్ట్

**5 లక్షల 10 వేల నగదు, కార్లు, సెల్ ఫోన్లు స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన డిసిపి కవిత**

జనోదయ, వరంగల్ క్రైమ్

ఏటీఎం కేంద్రాలకు కన్నం వేసి చోరీలకు పాల్పడుతున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అంతర్ రాష్ట్ర ముఠాకు చెందిన ఏడుగురు నేరస్థులను సిసిఎస్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా పట్టుకొని , వీరి నుండి 5లక్షల 10వేల రూపాయల నగదు, రెండు కార్లు, ఏడు సెల్ ఫోన్లు, నేరానికి వినియోగించే ఐరన్ ప్లైటను, డూప్లికేట్ తాళం చెవులను స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ అయిన వారు...ఆరిఫ్ ఖాన్, సర్పరాజ్ , యం.ఆష్ మహ్మద్, షాపూస్ ఖాన్, షారూఖాన్, అస్లాం ఖాన్,యం.షారుఖాన్. నిందితులందరు మాల్కిడా తాలుకా, అల్వార్ జిల్లా, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.ఈ అరెస్టుకు సంబందించి ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి కవిత వివరాలను వెల్లడించారు. నిందితులు ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ , కేరళ రాష్ట్రాల్లో మొత్తం 40కి పైగా చోరీలకు పాల్పడ్డారు. ఏటీఎంలలో చోరీలు చేసేందుకు వరంగల్ ట్రై సిటికి రెండు కార్లల్లో చేరుకున్న ఈ ముఠా ముందుగా నగరంలో ఏటీయం మిషన్లు వున్న కేం



ద్రాలు గుర్తించి గత నవంబర్ నుండి ఇప్పటి వరకు 7 ఏటీయం కేంద్రాల్లో ఈ ముఠా సభ్యులు చోరీలకు పాల్పడి మొత్తం 12లక్షల 10వేల రూపాయలు చోరీ చేసారు. ఇందులో సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు చోరీలకు పాల్పడగా, కాజీపేట, హన్మకొండ, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చోరీకి పాల్పడ్డారని వివరించారు.ముఠా సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ ఉన్నతాదికారులతో పాటు సిసిఎస్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఏఏఓ సల్మాన్ పాషా, కాజీపేట ఎస్.ఐలు నవీన్‌కుమార్,లవణ్ కుమార్, సిసిఎస్ ఎస్.ఐ శ్రీనివాస్ రాజు, హెడ్ కానిస్టేబుళ్ళు మహేశ్వర్, శ్రీనివాస్ కానిస్టేబుళ్ళు విష్ణు, కుమారస్వామి, శ్రీధర్, హన్మంతు, వినోద్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులను అందజేశారు.

# ముస్త్యాల నూతన సర్పంచ్‌కు ఘనంగా సన్మానం

జనోదయ : గోదావరిఖని ఆర్సీ

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ సుంకరి మహేష్, మరియు ఉప సర్పంచ్ బాసినేని వినోద సత్యనారాయణను వారి మిత్రమండలి శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నన్ను ఆదరించి నామీద నమ్మకంతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే ముస్త్యాల గ్రామానికి ఎల్లవేళలా వారితో మమేకమై ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం ఎల్లవేళల కృషి



చేస్తానని ఆయన అన్నారు. నేను చెప్పిన హామీలు తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో వారి మిత్రులు షేక్ జమీల్ హుస్సేన్, కొండ్ర అంజయ్య, కాపుర బోయిన సతీష్, షేక్ గౌస్ పాషా, షేక్ యాకుబ్, షేక్ ఇంతి యాజ్, షేక్ తాజొద్దీన్ బాబా, గ్రామ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బేరపున్నం చందర్,సుందిల్ల రాజు, బొద్దుపెల్లి రవి, సిద్ద శేఖర్,సుందిల్ల సతీష్ పాల్గొన్నారు.



# రవి సుమన్‌కు ఘనంగా సన్మానం

**జనోదయ : గోదావరిఖని ఆర్సీ**



పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజక వర్గం మార్కండేయ కాలనీలోని తెలంగాణ షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థానిక రేడియం శ్రీనివాస్ సుపుత్రుడు రవి సుమన్ ఇటీవల పాండిచ్చేరిలోని సెంట్రల్ యూనివర్సిటీలో మాస్ మీడియా అండ్ కమ్యూనికేషన్ లో జాయిన్ అయిన కొద్ది మాసాలలోనే కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛభారత్ షార్ట్ ఫిలిం కాంటెస్ట్లో పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించి తీసిన లఘు చిత్రానికి అవార్డు రావడం అట్టి అవార్డు పాండిచ్చేరి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం గోదావరిఖని ప్రజలందరికీ గౌరవంగా ఉంది. అలాగే కళాకారుల అందరికీ కూడా ఎంతో ఆదర్శనీయంగా ఉందని ఈ సందర్భంగా పాల్గొన్న పుర ప్రముఖులు కళాకారులు ప్రొడ్యూసర్లు రవి సుమన్‌ని కొనియాడుతూ అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి పెద్దపల్లి శాఖ అధ్యక్షులు కొమ్ము కుమార్ యాదవ్, కళాతోరణం ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ అమేజింగ్ స్టార్ అశోక్ వేముల, సీనియర్ కళాకారులు దామెర శంకర్ , గాంధీ గిరి వార్తల చైర్మన్ దయానంద్ గాంధీ, కార్మిక నాయకులు సిహెచ్ ఉపేందర్, డైరెక్టర్లు గొట్టె మహేష్, నగునూరి విజయ్, సంపత్ ఊదరి, బిఎన్ క్రియేషన్ అధినేత బడికెల గణేష్, కళాకారిణి జక్కిని శ్రీలత, మేకల శ్రీకాంత్, డాక్టర్ జెవీ రాజు న్యూ ఇండియా పార్టీ, సీని యర్ కళాకారులు వాసు, కుమార్, లక్ష్మణ్, అంజన్న, దామెర రాజేష్, రేడియం శ్రీనివాస్, శంకర్, ఉపాధ్యా యులు సతీష్, మరియు తదితరులు పాల్గొన్నారు.




# విధుల్లో మానవత్వం

**ప్రమాదస్థలంలో తక్షణ సహాయం**

**జనోదయ , గోదావరిఖని డిసెంబర్ 28:**



గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సమయంలో అక్కడే విధుల్లో ఉన్న రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు వెంటనే స్పందించి మానవీయతను చాటారు. గాయపడిన మహిళను తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. అదే సమయంలో ట్రాఫిక్ నియంత్రణను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణతో పాటు మానవీయ దృక్పథాన్ని ప్రదర్శించిన ఇన్‌స్పెక్టర్ చొరవను స్థానికులు ప్రశంసించారు. ఈ ఘటనతో ట్రాఫిక్ పోలీసులు కేవలం వాహనాల నియంత్రణకే పరిమితం కాకుండా, ప్రజల భద్రత మరియు ప్రాణరక్షణలోనూ ముందుంటారనే నమ్మకం మరింత బలపడిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజాసేవలో ఇలాంటి స్పందన ఆదర్శంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.






# 2029 నాటికి శ్రీహరికోటలో కొత్త లాంచ్‌ప్యాడ్

**శ్రీహరికోట, డిసెంబర్ 28 :**



భారీ శాటిలైట్స్‌ను రోదసిలోకి పంపేందుకు ఇస్రో శ్రీహరికోట వద్ద నిర్మిస్తున్న మూడవ లాంచ్ ప్యాడ్ 2029నాటికి అందుబాటులోకి రాబోతున్నది. దీని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నాలుగేండ్లలో ఇది పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని ఇస్రో ఉన్నతాధికారి పద్మకుమార్ తెలిపారు. భవిష్యత్ ప్రయోగాల్లో ఇస్రో సామర్థ్యాన్ని ఈ లాంచ్ ప్యాడ్ మరింత పెంచుతుందని అన్నారు. 12 వేల నుంచి 14వేల కిలోల బరువుండే భారీ శాటిలైట్స్‌ను అంతరిక్షంలోకి పంపే విధంగా మూడవ లాంచ్ ప్యాడ్‌ను ఇస్రో నిర్మిస్తున్నది.

# గంభీర్‌పై నమ్మకముంది

**కోచ్ మార్పు వార్తలు ఊహాగానాలే..**

**బీసీసీఐ క్లారిటీ**

**ముంబై:** భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను టెస్టుల్లో తొలగించి ఆ బాధ్యతలను దిగ్గజ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు అప్పగిస్తారని వస్తున్న వార్తలపై బీసీసీఐ స్పందించింది. అవన్నీ ఊహాజనితమని, అసలు అలాంటి చర్చే జరుగలేదని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఇదే విషయమై ఆయన మాట్లాడుతూ.. 'కోచ్ మార్పుపై వస్తున్న వార్తలు అవాస్తవం. అవన్నీ పూర్తిగా ఊహాజనితమైనవి. కొన్ని ప్రముఖ న్యూస్ ఏజెన్సీలు కూడా ఇలాంటివి ప్రచారం చేయడం సరికాదు. అసలు బోర్డులో అలాంటి (కోచ్ మార్పు) చర్చే జరుగలేదు. కొంతమంది వారికి తోచిన విధంగా ఆలోచించి దానిని నిజమని ప్రచారం చేస్తుంటారు. గంభీర్ కాంట్రాక్టు 2027 ప్రపంచ కప్ వరకూ ఉంది. అతడిపై మాకు పూర్తి నమ్మకముంది. మేం ఎవరినీ సంప్రదించ చలేదు' అని తెలిపాడు.



# గ్రామాలను 'డిజిటల్ విలేజ్'లుగా తీర్చిదిద్దండి

**ప్రజాస్వామ్యంలో గ్రామాలు బలంగా ఉంటేనే... రాష్ట్రాలు, దేశం అభివృద్ధి**

**ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా బాధ్యతతో పని చేయండి**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సన్మానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**జనోదయ : హైదరాబాద్**

ప్రజల ముంగిటకు పౌర సేవలను చేర్చేలా గ్రామాలను "డిజిటల్ విలేజ్"లుగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని సర్పంచులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. టెక్నాలజీని అందిపుచ్చుకునే ప్రక్రియలో గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. గ్రామీణులకు మేలు చేయాలనే గొప్ప సంకల్పంతో యూపీఏ హయాంలో ప్రారంభమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఆదివారం శంషాబాద్ లోని కేఎల్ సీసీ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యంలో "గ్రామం" అనేది పునాది వంటిదని, అది బలంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. పదవీ కాలం పూర్తయ్యేలోపు, "మా సర్పంచ్ మా గ్రామాన్ని పూర్తిగా మార్చేశాడు" అని ప్రజలు చెప్పుకునేలా పని చేయాలని సర్పంచులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు అందేలా పారదర్శకంగా కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. గ్రామ స్వరాజ్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీలకు దండిగా నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. కొత్త సర్పంచులపై బృహత్తర బాధ్యత ఉందని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వారధిలా పని చేయాలన్నారు. గెలిచామనే గర్వంతో కాకుండా గ్రామాభివృద్ధి కోసం చిత్త శుద్ధితో పని చేయాలన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు లాంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అందరి భాగస్వామ్యంతో ఈ అయిదేళ్లలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాక ఎంతో మంది సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వాటిని దశల వారీగా క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టం చేశారు. దశల వారీగా సర్పంచులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. హుందాగా శాసనసభ సమావేశాలు నిర్వహిస్తామని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని దీటుగా తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, గారు, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.







## సిత్యా తండా సర్పంచ్‌కి ఘన సన్మానం



**జనోదయ, మాడుగులపల్లి, డిసెంబర్ 28**

మండలంలోని సీత్యా తండా గ్రామ సర్పంచ్ ఉమారాణి వెంకన్నకు ఆదివారం గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉమారాణి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధికి పాటుపడతానని గ్రామ ప్రజల సమక్షంలో తెలియజేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి, పిఎసిఎస్ వేమనపల్లి మాజీ చైర్మన్ చేరిపోతుల రాములు గౌడ్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాలుట్ల బాబయ్య,మాజీ సర్పంచ్ సుధాకర్, వేములపల్లి సర్పంచ్ పుట్టల సందీప్,తోపుచర్ల సర్పంచ్ నన్నే బోయిన పార్వతి చంటి పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు ఘన సన్మానం



**జనోదయ : మాడుగులపల్లి:**

మాడ్గులపల్లి మండలంలోని బొమ్మకల్లు గ్రామపంచాయతీ సర్పంచ్ బొమ్మకంటి కల్పన కిరణ్ దంపతులను ఆదివారం బంధుమిత్రులు వారికి తన స్వగృహంలో ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మ కంటి రామ్ కుమార్ శ్రీనివాస్ కృష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చదివితేనే అభివృద్ధి సాధ్యం

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ పాఠశాలను , కళాశాల భవనాలను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**జనోదయ : మాడుగులపల్లి:**

బాలికలు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. చదివితేనే అభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు.ఆదివారం మంత్రి నల్గొండ జిల్లా, మాడుగులపల్లి మండల కేంద్రంలో సుమారు 6 కోట్ల 74 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ పాఠశాల, కళాశాల భవనాలను ప్రారంభించారు. అంతేకాక 64 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించనున్న ప్రహరికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అమ్మాయిలు పట్టుపట్టి చదివి పైకి రావాలని, మాడుగుల పల్లి కేజీబీవీ నుండి గతంలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థినిని విశాఖపట్నంకు ఫ్లైట్ ద్వారా పంపించడం జరిగిందని, ఈ సంవత్సరం ఎంసెట్లో మంచి ర్యాంకు తెచ్చుకున్న వారి చదువు ఖర్చులన్ని తానే భరిస్తానని మంత్రి తెలిపారు. మాడుగుల పల్లి కె జి బి వి పాఠశాల అభివృద్ధికి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమయ్యే సహకారాన్ని అందిస్తానన్నారు .అందువల్ల అమ్మాయిలు బాగా కష్టపడి చదువుకోవాలని, అబ్దుల్ కలాం చెప్పినట్లు మంచి కలలు కనడమే కాకుండా, వాటిని సాధించుకోవాలన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి చదువు చెప్పాలని అన్నారు .నల్గొండ జిల్లా కేంద్రంలో బొట్టుగూడా ప్రాథమిక పాఠశాలను ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 3 కోట్ల రూపాయల వ్యయంతో అధునాతన సౌకర్యాల తో నిర్మాణం చేపటడం జరిగిందని, సంక్రాంతి లోపు రాష్ట్ర ముఖ్యమంత్రి చేత దానిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, అందువల్ల ప్రజలు ప్రైవేటు పాఠశాలల వైపు ఆలోచించవద్దని తెలిపారు.నల్గొండ జిల్లా కేంద్రంలో 200 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు పురోగతిలో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 20 000 కోట్ల రూపాయలు ఖ ర్చు చేసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠ శాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. కెజిబివి పాఠశాలకు డ్యూ యల్ డెస్క్ లు కావాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కోరిన మీదట మంత్రి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అవసరమైన ఫర్నిచర్ ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. మాడుగుల పల్లి మండల కేంద్రంలో 14 కోట్ల రూపాయలతో తహసిల్దార్, ఎంఈఓ, పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గత సంవత్సరం బాగా చదివి మంచి జిపిఎ తెచ్చుకున్న విద్యార్థులను ఫ్లైట్ ద్వారా విశాఖపట్నం పంపించామని, ఈ సంవత్సరం స్థలంతో నిమిత్తం లేకుండా దేశంలో ఎక్కడికైనా పంపిస్తామని, అందువల్ల కష్టపడి చదవాలని చెప్పారు. మాడుగుల పల్లి కె జి బి వి కి కొత్త బిల్డింగు రావడం వల్ల అన్ని సౌకర్యాలు సమకూరుతాయని, అందువల్ల బాగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానాలు పొందాలని చెప్పారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , మాడుగులపల్లి సర్పంచ్ నరేష్ ,తదితరులు మాట్లాడారు. ముందుగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత పాఠశాల రిపోర్టు చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్చార్జి డిఆర్ఓ వై .అశోక్ రెడ్డి, డీఈవో బిక్షపతి, స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, ఎం ఈ ఓ పాల్గొన్నారు.





## మృతుని కుటుంబానికి రెండు లక్షల రూపాయల సాయం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**జనోదయ:మాడుగులపల్లి:**

మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన కొండ నాగరాజు (బన్నీ) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసు కున్న రాష్ట్ర రోడ్డు భవనాల సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మృతుడు నాగరాజు ఇం టికి వెళ్లి అతని భార్య పిల్లల్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో మీ పిల్లలకు ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తాను మీరు అధైర్యపడవద్దు అని ధైర్యం చెప్పారు. కొండ రేణుకకు 2,00,000 రెండు లక్షల) ఆర్థిక సహాయం చేశారు. ఎప్పుడైనా ఏ సహాయం కావాలన్నా స్థానిక నాయకులు చెబితే వెంటనే స్పందిస్తారని అభయం ఇచ్చారు. వారి వెంట పాశం రామ్‌రెడ్డి, మాడుగులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, పుల్లెంల సైదులు, స్థానిక సర్పంచ్ ఆరూరి నరేష్ ,జాక్ రమేష్, ఎరుకలి వెంకన్న, వడ్డే సైదిరెడ్డి,జానయ్య,ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.








Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 ..... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673

జనోదయ



## సభకు కేసీఆర్?

# నేటి నుంచే వార్

- నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- సాగునీటి ప్రాజెక్టులపైనే ప్రధాన చర్చ
- పాలమూరు..రంగారెడ్డిపై బీఆర్ఎస్ గరం..గరం
- కేసీఆర్ సభక వస్తే సాగునీటిపై చర్చకు సిద్ధమన్న సీఎం
- తాము చర్చకు సిద్ధమేనన్న కేటీఆర్,హరీష్
- సభను హుందాగా నడుపుతాం: మంత్రి దుద్దిళ్ల
- సర్కార్ వైఫల్యాన్ని ఎండగడతాం: ఏలేటి



నేటి సభలో మొదట డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
మరణించిన మాజీ సభ్యులకు సంతాపాలు
ఆపై జనవరి 2కు వాయిదా..
అనంతరం బీఏసీ భేటీ





**తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమా వేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో సాగునీళ్ల అంశంపై వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ అంశంపై కొద్దిరోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యు ద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాం తాల్లో నీటి కేటాయింపులు, ప్రాజె క్టులు తదితర అంశాలపై సభలో కూడా చర్చ జరగనుంది. ఇందు కోసం ప్రభుత్వం అన్ని వివరాలను సిద్ధం చేస్తోంది. ప్రధానంగా పాల మూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కీలక చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుపై సభలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వ నున్నట్టు సమాచారం.**

### సభను హుందాగా నడుపుతాం: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, డిసెంబరు 28 :** తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో సాగునీళ్ల అంశంపై వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ అంశంపై కొద్దిరోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నీటి కేటాయింపులు, ప్రాజెక్టులు తదితర అంశాలపై సభలో కూడా చర్చ జరగనుంది. ఇందు కోసం ప్రభుత్వం అన్ని వివరాలను సిద్ధం చేస్తోంది. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై కీలక చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుపై సభలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు సమాచారం. ఒకరోజు మొత్తం ఈ అంశంపై చర్చకే కేటాయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ చాలాకాలం తర్వాత సభకు వచ్చే అవకాశం ఉండటంతో సాగునీటి అంశాన్ని లోతుగా చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల మీడియా సమావేశంలో మాట్లాడిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'అధికార పార్టీ తోలు తీస్తాం. సాగునీటి విషయంలో నిజాలు నిగ్గు తేలుస్తాం' అంటూ బచావత్ ట్రిబ్యునల్ అంశాన్ని లేవనెత్తారు. కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే నీళ్ల కేటాయింపులపై అన్ని విషయాలు చర్చిద్దామని సవాల్ విసిరారు. దీంతో సమావేశాల్లో కూడా వాడివేడి చర్చ తప్పదని భావిస్తున్నారు. సోమవారం ఉదయం శాసన సభ ప్రారంభం కాగానే మొదట డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. ఆ వెంటనే పలు బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. ఇటీవల ప్రభుత్వం జారీచేసిన పలు ఆర్డినెన్స్‌లకు సంబంధించిన బిల్లును సభ ముందు ఉంచనున్నారు. తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (అమెండ్ మెంట్) బిల్లు-2025తో పాటు తెలంగాణ మునిసిపాలిటీస్ చట్ట సవరణ బిల్లు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్ట సవరణకు సంబంధించిన రెండు బిల్లులను సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశపెడతారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్, వేతన నిబంధనలకు సంబంధించిన రెండు బిల్లును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెడతారు. పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లు తోపాటు ఎంపీపీ, జడ్‌పీపీలకు సంబంధించి ఇటీవల ప్రచురించిన గెజిట్‌ను ఆ శాఖ మంత్రి సీతక్క సభ ముందు ఉంచుతారు. తెలంగాణ హార్టికల్చర్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల ఆడిట్ నివేదికలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సభకు సమర్పిస్తారు. ఆ తర్వాత ఇటీవల మరణించిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు అసెంబ్లీ, మండలిలో సంతాపం ప్రకటిస్తారు. అనంతరం జీరో అవర్ చేపడుతారు. ఆ తర్వాత సభలను వచ్చే ఏడాది జనవరి 2వ తేదీకి వాయిదా వేస్తారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరగనుంది. సభలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశాన్ని ఈ సమావేశంలో ఖరారు చేస్తారు.

### సభను హుందాగా నడుపుతాం : శ్రీధర్‌బాబు

శాసనసభ శీతాకాల సమావేశాలను హుందాగా నడుపుతామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెద్దాయన సభకు వస్తే ఆయన గౌరవానికి ఎక్కడా భంగం కలిగించబోమని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేసీఆర్ అనుభవం అవసరమని.. సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు.

### చర్చకు మేం సిద్ధం: కేటీఆర్

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సహా సాగునీటి అంశంపై సభలో చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పాలమూరును సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ వలసల జిల్లాగా మార్చారని ఆదివారం ఆయన ఆరోపించారు. పాలమూరుకు నీళ్ల కోసం పోరాటానికి కేసీఆర్ సిద్ధమని తెలిపారు. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే ఆ ప్రాజెక్టు టెండర్లను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీల జలాలు చాలు అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. అధికార పార్టీ వాళ్లు ఇబ్బందుల్లో పడిన ప్రతిసారీ అసెంబ్లీ నిర్వహించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో ఏ చర్చపెట్టినా తాము మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

### సాగునీటి రంగం అస్తవ్యస్తం: ఏలేటి

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో సాగునీటి రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా కృష్ణా, గోదావరి బేసిన్లపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించలేదని మండిపడ్డారు. మైనర్ ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని.. చెరువులు, కుంటలు పాడైపోయాయని తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శీతాకాల సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ నగరం పూర్తిగా ఆగమైపోయిందని.. ఉన్న నగరాన్నే సరిగ్గా నిర్వహించలేని ప్రభుత్వం, 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపుతోందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ ఎండగడుతుందని తెలిపారు.



## గంగాధర మండల ఉప సర్పంచ్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా అన్నాల్ దాస్ తిరుపతి ఎన్నిక:

**గంగాధర జనోదయ, డిసెంబర్ 28:** గంగాధర మండల ఉప సర్పంచ్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా బూరుగుపల్లి గ్రామ ఉప సర్పంచ్ గారు అన్నాల్దాస్ తిరుపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రజాసేవ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, నాయకత్వ గుణాలు ఈ బాధ్యతలో మరింత వెలుగొందుతాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. మండల స్థాయిలో ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామాల అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగి, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే..



**జనోదయ కొడిమ్యాల డిసెంబర్ 28:** : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామంలో ఆదివారం రోజున స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్టీసీ బస్సును గ్రామస్తుల సౌకర్యార్థం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని, కరీంనగర్ నుండి నమిలికొండ, శ్రీరాములపల్లె గ్రామాల వరకు నడిచే ఈ బస్సును గ్రామస్తులు వినియోగించుకోవాలని, భవిష్యత్తులో నల్లగొండ గ్రామం వరకు బస్సు సౌకర్యాన్ని పొడిగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ టి సి అధికారులు విజయ మాధురి, సర్పంచ్ మహమ్మద్ షాబుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కడారి మల్లేశం, సర్పంచులు జీవన్ రెడ్డి, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ రాజ నర్సింగరావు,నాయకులు నారాయణ గౌడ్, మ్యాకల మల్లేశం, ముత్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

**జనోదయ, పెగడపల్లి డిసెంబర్ 28:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన బందారి వెంకటేశం (50) అనే వ్యక్తి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన ఆయన.. ఆదివారం మద్యం మత్తులో తన పొలం సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. నిన్న సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిన వెంకటేశం కోసం బంధువులు వెతకగా.. వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైందని ఎస్సై చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.



## కుటుంబ సమేతంగా ఆదివరహాస్వామిని దర్శించిన 1 ఇన్‌క్లైన్ అసిస్టెంట్ మేనేజర్



**జనోదయ, కమాన్‌పూర్ డిసెంబర్ 28:** ఆదివారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరహాస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. 1 ఇన్‌క్లైన్ అసిస్టెంట్ మేనేజర్ ఆడెపు రాజు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శాంతితో నిండిపోయాయి. శాంతి–భక్తి సమ్మేళనంగా సాగిన ఈ దర్శనం భక్తులను ఆకట్టుకుంది. ఆలయానికి వచ్చిన అతిథులను టెంపుల్ ఈవోతో పాటు కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, కమాన్‌పూర్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుతారి రాజేందర్ సాదరంగా స్వాగతించారు. సంప్రదాయబద్ధంగా శాలువాలతో సత్కరించి, అనంతరం స్వామివారి ఆశీస్సులతో తీర్థ–ప్రసాదాలు అందజేశారు..

# అక్రమంగా ఔషధాల విక్రయం: కరీంనగర్‌లో క్వాక్ క్లినిక్‌పై డ్రగ్స్ కంట్రోల్ దాడి

**జనోదయ – కరీంనగర్ | డిసెంబర్ 28, 2025:** కరీంనగర్ పట్టణంలోని విద్యానగర్ ప్రాంతంలో అర్హతలేని వ్యక్తి నిర్వహిస్తున్న క్వాక్ క్లినిక్‌పై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన భారీ మొత్తంలో మందులను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ చర్య చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

డిసెంబర్ 27, 2025న విద్యానగర్, హెచ్.నెం. 10211లో ఉన్న లక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ను నిర్వహిస్తున్న కె. లక్ష్మీనారాయణ అనే వ్యక్తి తగిన వైద్య అర్హతలు లేకుండా క్లినికల్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో చెల్లుబాటు అయ్యే డ్రగ్ లైసెన్స్ లేకుండా అమ్మకానికి ఉంచిన మొత్తం 39 రకాల ఔషధాలు బయటపడ్డాయి. వీటిలో 35 రకాల వైద్యుల నమూనా మందులు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న మందుల విలువ సుమారు రూ. 15,011గా అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న ఔషధాలలో సెఫిక్సీమ్, ఆఫ్లాక్సాసిన్, క్లోక్సాసిల్లిన్, అమోక్సిసిల్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయోటిక్స్ ఉన్నాయి. అర్హతలేని వ్యక్తులు యథేచ్ఛగా యాంటీబయోటిక్స్ విక్రయించడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడడమే కాకుండా, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ వంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు హెచ్చరించారు. ఈ దాడిని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. ఉమారాణి (కరీంనగర్) మరియు పీ. శ్రవణ్ కుమార్ (పెద్దపల్లి) నేతృత్వంలో నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న మందుల నమూనాలను ప్రయోగశాల పరీక్షల కోసం పంపించి, తదుపరి విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940 ప్రకారం బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని DCA స్పష్టం చేసింది.



అలాగే, క్వాక్‌లు, అర్హతలేని వ్యక్తులు లేదా లైసెన్స్ లేని దుకాణాలకు మందులు సరఫరా చేయడం చట్టవిరుద్ధమని హోల్‌సేలర్లు, డీలర్లకు DCA హెచ్చరిక జారీ చేసింది. సరఫరా చేసే ముందు చెల్లుబాటు అయ్యే డ్రగ్ లైసెన్సులను తప్పనిసరిగా పరిశీలించి రికార్డులు నిర్వహించాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే గరిష్టంగా ఐదేళ్ల జైలు శిక్ష వరకు విధించే అవకాశం ఉందని తెలిపింది. అక్రమ ఔషధ కార్యకలాపాలు, అనుమానాస్పద మందుల తయారీ, మత్తు పదార్థాలు లేదా సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సులపై సమాచారం ఉంటే ప్రజలు DCA టోల్ ఫ్రీ నంబర్ 1800 5996969కు (పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు) ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

# జర్నలిస్టుల హక్కులను కాల రాస్తే చూస్తూ ఊరుకోము

**ముల్కల్ల రాజేంద్రప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ BSP మంచిర్యాల జిల్లా అధ్యక్షులు**

**జనోదయ ఉమ్మడి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 28:** రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 252 ను వెంటనే ఉపసంహరించుకోవాలని, జర్నలిస్టుల హక్కులను కాల రాస్తే చూస్తూ ఊరుకోమన్నారు బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్. జీవో నెంబర్ 252 ను ఉపసంహరించి జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ ఇవ్వాలని ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా అంటూ విభజించి పాలించే విధానం మంచిది కాదని హెచ్చరించారు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, ఎన్నో కష్టనష్టాలను ఓర్చి ప్రజలకు ప్రభుత్వం మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ అనేది గుర్తింపు మాత్రమే కాదని వృత్తి బాధ్యత స్వేచ్ఛ గౌరవానికి సంబంధించిందన్నారు, జర్నలిస్టులను ఇబ్బంది పెట్టే ఎటువంటి నిర్ణయాన్ని అయినా బహుజన్ సమాజ్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు జీవో నెంబర్ 252 ఉపసంహరించి జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్. పత్రిక ముఖంగా తెలియజేశారు గోపాల్ , ఆర్.వి.ఎల్.ఎన్.ప్రసాద్, దారం జగన్నాథం రెడ్డి, నంబి పర్వతాలు, సి.హెచ్.శ్రీనివాస్, రవికాంతి శ్రీనివాస్, కె.బాబురావు, వివిధ జిల్లాల ప్రతినిధులు, తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.



# టవేరా వాహనం ఢీకొని... భార్యాభర్తలు దుర్మరణం

**జనోదయ .గొల్లపల్లి, డిసెంబర్ 28**

టవేరా వాహనం ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాపూర్‌కి చెందిన రెడపాక లింగయ్య(50), లచ్చవ్వ(48) దంపతులు. హైదరాబాద్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆదివారం తెల్లవారుజామునే ద్విచక్రవాహనం పై బయలుదేరారు. గొల్లపల్లి శివారుకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన టవేరా వాహనం వారి బైకుని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనతో అబ్బాపూర్‌లో విషాదం నెలకొంది.




# ఐదేళ్లలో తొలిసారి.. సైబర్ నేరాలు తగ్గాయ్

**జనోదయ హైదరాబాద్, డిసెంబర్ 28**

2021లో 7,280.. 2024లో 19,643.. రాజధానిలో సైబర్ నేరాలు అమాంతం పెరిగిన తీరిది. సైబర్ నేరగాళ్ల మాయాజాలానికి ఏటా రెట్టింపు సంఖ్యలో కేసులు నమోదవుతూ వచ్చాయి. 2024తో పోలిస్తే.. ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది 13,656 కేసులు నమోదయ్యాయి. ఐదేళ్ల గణాంకాలను పరిశీలించగా ఈసారి తక్కువ సంఖ్యలో నమోదవ్వడం ఇదే తొలిసారి. అవగాహనతోనే కట్టడి.. నేరగాళ్ల ఎత్తుల్ని చిత్తు చేసేందుకు పోలీసు శాఖ అనేక సాంకేతిక విధానాలను అందుబాటులోకి తెచ్చింది. సైబర్ నేరగాళ్లు ఒక్కసిమ్‌కార్డు, వెబ్‌సైట్‌తో వందలాది మందిని మోసగిస్తున్నారు. దీనికి పరిష్కారంగా నేరస్థులు ఉపయోగించే సిమ్‌కార్డులు, వెబ్‌సైట్లు, ఐఎంఈఐ బ్లాక్ చేస్తూ మరో నేరం చేయకుండా కట్టడి చేసింది. తెలంగాణ సైబర్‌సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ).. 2023 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 43,118 సిమ్‌కార్డులు, 18,149 ఐఎంఈఐలు, 5,026 యూఆర్‌ఎల్‌లను నిర్వీర్యం చేసింది. సైబర్ నేరాల్లో నిందితుల్ని గుర్తించడం అసాధ్యం.. బాధితులు పోగొట్టుకున్న డబ్బు తిరిగి రాబట్టడం అంతకుమించిన పని అనే భావనను పోలీసు శాఖ తొలగించింది. నేరస్థుల అరెస్టుతోపాటు సొత్తు రికవరీ పెరుగుతోంది. సైబరాబాద్ పోలీసులు 2024లో 534 మందిని, 2025లో ఏకంగా 917 మందిని అరెస్టు చేశారు. సైబర్ నేరాలు తగ్గడానికి ప్రజల్లో పెరిగిన అవగాహన కూడా కారణమే. ఒకప్పుడు డెబిట్, క్రెడిట్ కార్డు అప్‌డేట్, కస్టమర్ కేర్ పేరుతో మోసాలు జరిగేవి. కస్టమర్ కేర్ మోసాల మీద కేంద్ర టెలికాం శాఖ చర్యలు తీసుకుంది. టెలికాం సంస్థలు స్పామ్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చాయి. దీనికితోడు నకిలీ వెబ్‌సైట్లు, ఓటీపీ మోసాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ఆన్‌లైన్ వేదికగా జరిగే బ్యాంకింగ్ మోసాలపై ఆర్‌బీఐ సూచనలతో బ్యాంకులు మ్యూల్ ఖాతాలు గుర్తించేలా చర్యలు తీసుకున్నాయి.



**ఐదేళ్లుగా నమోదైన కేసుల తీరు**

| ఏడాది | హైదరాబాద్ | సైబరాబాద్ | రాచకొండ | మొత్తం |
|---|---|---|---|---|
| 021 | 2,066 | 3,854 | 1,360 | 7,280 |
| 022 | 2,249 | 4,850 | 2,049 | 9,148 |
| 023 | 2,984 | 5,983 | 2,562 | 11,529 |
| 024 | 3,111 | 11,914 | 4,618 | 19,643 |
| 025 | 2,286 | 7,636 | 3,734 | 13,656 |